



జాగరణ..!

- వారం నుంచి పని చేయని సర్వర్
- స్తంభించిన పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు
- కర్నూలు యార్డులో పేరుకుపోయిన ఉల్లి
- అమ్మకాల కోసం రైతుల ఎదురుచూపులు



కర్నూలు మార్కెట్ యార్డు రైతులు తీసుకొచ్చిన ఉల్లిగడ్డలు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతన్నకు ఇబ్బందులు తప్పడం లేదు. వారం రోజులుగా సర్వర్ పని చేయకపోవడంతో మార్కెట్లలో క్రయవిక్రయాలు ఆగిపోయాయి. దీంతో రైతులు తమ పంట ఉత్పత్తులతో మార్కెట్లలో జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు మార్కెట్ యార్డులో అయితే ఉల్లి గుట్టలుగా పేరుకుపోయింది. వాహనాలు రోడ్డుపై వరకు బారులుతీరి కనిపిస్తున్నాయి. దీంతో ఉల్లి ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఉల్లిగడ్డల బస్తాలపైనే పడుకున్న రైతు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు భూషన్న. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో తనకున్న ఎకరా పొలంలో ఉల్లి సాగు చేశాడు. 80 ప్యాకెట్ల ఉల్లిని మంగళవారం కర్నూలు యార్డుకు తీసుకు వచ్చాడు. అయితే.. సర్వర్ సమస్య కారణంగా ఉల్లి విక్రయాలు ఆలస్యమవుతాయని అధికారులు చెప్పడంతో తప్పదన్నట్లుగా మూడు రోజుల పాటు యార్డులోనే జాగరణ చేస్తున్నాడు. గోరు చుట్టుపై రోకటి పోటులా శుక్రవారం ఆఫ్‌లైన్‌లో కూడా విక్రయాలు చేయలేమని, మరో మూడు రోజులు ఆగాల్సిందేనని అధికారులు చెప్పడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నాడు. ప్రస్తుతం యార్డులో లక్షన్నర బస్తాల ఉల్లిగడ్డలు గుట్టల్లా పేరుకుపోయాయి. వీటన్నింటిని ఏవిధంగా అమ్మాలో దిక్కుతోచక అధికారులు లబోదిబోమంటుంటున్నారు. వందలాది మంది అన్నదాతలకు మాత్రం పడిగాపులు తప్పడం లేదు.

మిగతా 8లో..

న్యూస్ బాక్స్

డీఈవోగా శ్యామ్యూల్ పాల్ బాధ్యతలు



కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎస్. శ్యామ్యూల్ పాల్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇదే కార్యాలయంలో సాధారణ ఉద్యోగిగా పని చేసిన ఆయన అంచలంచెలుగా ఎదిగారు. బుక్ డిపో మేనేజర్‌గా విధుల్లో చేరిన ఆయన డీఈవో స్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఉద్యోగ బాధ్యతల స్వీకరణ అనంతరం డీఈఓ, సమగ్ర శిక్ష కార్యాలయంలోని ఏడీ శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు కోటేశ్వరరావు, రవి, బలరామిరెడ్డి, మద్దిలేటి ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు డీఈఓ శ్యామ్యూల్ పాల్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించండి

డీఈఓ శామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 28వ తేదీ నుంచి నవంబరు 11వ తేదీలోగా ఫీజు చెల్లించేలా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈఓ శామ్యూల్ పాల్ అన్నారు. రూ.50 ఆలస్య రుసుంతో నవంబరు 12 నుంచి 18వ తేదీ వరకు, రూ.200తో నవంబరు 19 నుంచి 25వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుంతో నవంబరు 26వ తేదీ నుంచి 30వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పరీక్ష ఫీజును డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పాఠశాల లాగిన్ ద్వారా చెల్లించాలన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

కర్నూలు లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కర్నూలు బార్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ తెలియజేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీ ఇంత వరకు కార్యరూపం దాల్చలేదని వారు తెలిపారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ కాదని, తమకు హైకోర్టు ఫుల్ బెంచ్ కావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల్లోపు నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో తాము ప్రత్యక్షంగా ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. శ్రీబాగ్ ఒడంబడిక ఒప్పందం మేరకు కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు కే ఓంకార్, జి.నాగవేషయ్య, పి.ప్రభాకర్ రెడ్డి తదితరులు ప్రసంగించారు.

2న జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు నవంబరు 2న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని సీసీఓ చాంబర్‌లో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని ఆయన తెలిపారు.

దరఖాస్తులన్నీ పరిష్కరించాలి

- ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలి
- జనవరిలోపు గోకులాలను పూర్తి చేయాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులు తప్ప గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, క్రాప్ ఇన్సూరెన్స్ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభల్లో కోర్టు కేసులకు సంబంధించిన దరఖాస్తులు తప్ప మిగిలిన అన్నీ వచ్చే పరిష్కరించాలన్నారు. డివిజన్ల వారీగా, డివిజన్ కేంద్రాల్లో రెవెన్యూ అధికారులు కాన్ఫరెన్స్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉపాధి పనులు కల్పించడంలో ఎంపీడీవో, ఏపీవోలు చాలా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని అసంతృప్తిని వ్యక్తం చేశారు. జనవరి నెలలోపు గోకులాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మంత్రాలయం హుండీ ఆదాయం 8

రూ.3.38 కోట్లు

భర్తను హతమార్చిన భార్య

వివాహేతర సంబంధమే కారణం

ఆత్మకూరు మండలం కృష్ణాపురంలో ఘటన 9

కర్నూలు నగరపాలక సమావేశం రసాభాస



పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం

మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పేదవాడి ఆకలి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్ స్పెషాలిటీ విభాగం పక్కన ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఏడు జిల్లాల నుంచి ప్రజలు వైద్యం కోసం వస్తారని తెలిపారు. పేద రోగులకు తక్కువ ఖర్చులతో నాణ్యతగల ఆహారాన్ని అందించేందుకు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించామని చెప్పారు. అనంతరం మంత్రి, కలెక్టర్ పి.రంజిత్ బాషా స్వయంగా ప్రజలకు అల్పాహారాన్ని వడ్డించారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్‌కే ప్రకాష్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, టూరిజం డైరెక్టర్ ముంతాజ్ పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న మంత్రి భరత్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆర్‌యూ ఉపకులపతి

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లోనూ రాణించాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శుక్రవారం తన చాంబర్లో కలిసిన ఇంజనీరింగ్ విద్యార్థులను రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడుతో కలిసి అభినందించారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో జిజ్ఞాన-2కే24 కార్యక్రమంలో భాగంగా రెండు రోజులుగా నిర్వహించిన పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీల్లో వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ఈసీఈ 3వ సంవత్సరం విద్యార్థులు మొదటి బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ కాలేజీ నుంచి మొత్తం 23 బృందాలు పాల్గొన్న పోటీల్లో రూ.3 వేల నగదు బహుమతిని సాధించినట్లు వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు సీహెచ్ మనీష్ కుమార్, బి. ధరణి, సీ. నవీన్‌లను వీసీ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాదరెడ్డి, ఈసీఈ డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ శరత్‌తో పాటు వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. టపాసుల విక్రయాలు జరిగే ప్రాంతాల్లో పలు జాగ్రత్తలు సూచనలు పాటించాలని అన్నారు. కేటాయించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, నీరు, ఇసుక తదితర అగ్నిమాపక సామగ్రిని సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకుంటే 100 లేదా డయల్ 112కి ఫోన్ చేయాలని కోరారు.

ప్రాపర్టీ కేసుల్లో రికవరీ శాతం పెరగాలి

- లాంగ్ పెండింగ్, మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- నేర సమీక్షలో ఎస్పీ జి. బిందు మాధవ్

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులలో ప్రాపర్టీ రికవరీ శాతం పెంచి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసులపై ఆరా తీశారు. సబ్ డివిజన్‌ల వారీగా పోలీసు బృందాలను ఏర్పాటు చేసి దొంగతనాల కేసులను ఛేదించి రికవరీ శాతం పెంచి బాధితులకు న్యాయం చేయాలన్నారు. 2022, 2023, 2024 సంవత్సరాల వారీగా చాలా కాలంగా ఉన్న పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియంపై అపోహలు వస్తున్నాయని, వాటిపై పోలీసు అధికారులు దృష్టి సారించాలన్నారు. అలాగే మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సర్వీస్ ప్రొవైడర్స్ (బ్యాంకు, గ్యాస్ కనెక్షన్, ఆధార్ వంటి ఫోన్ నెంబర్లు) ఆరా తీయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలోని వివిధ కేసులలో ప్రతిభ కనబరిచిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ నేర సమీక్షలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు బాబుప్రసాద్, వెంకట్రామయ్య, ఉపేంద్రబాబు, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జి.బిందు మాధవ్

బీఈడీ ఐసెటీ పేపరు లీక్

నిలిచిపోయిన పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్ష పేపర్ లీక్ అయింది. శుక్రవారం ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నికల్ పరీక్షలు రాసేందుకు విద్యార్థులు గదిలోకి వెళ్లారు. టెక్నికల్ సమస్యతో పరీక్ష వాయిదా వేస్తున్నామంటూ ప్రకటించడంతో విద్యార్థులు కేంద్రాల నుంచి వెనుదిరిగారు. 2023-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 23 నుంచి 28 వరకు బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని సర్క్యులర్ జారీ అయింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలోని ఒక పరీక్షా కేంద్రంలో గురువారం జరగాల్సిన పరీక్షా సమయంలో శుక్రవారం నాటి పేపర్‌ను విద్యార్థులకు చేరవేశారు. విద్యార్థులు ఇన్విజిలేటర్‌కు విషయం తెలియజేయడంతో వెంటనే వాటిని వెనక్కి తీసుకున్నారు. పరీక్షల విభాగం కంట్రోలర్‌కు విషయం తెలియడంతో పరీక్షలను నిలిపివేశారు. పరీక్ష కేంద్రాన్ని రద్దు చేసి తరుపరి చర్యలు తీసుకుంటామని ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు తెలిపారు.

వేతన వెతలు

- జీతాల కోసం సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బంది నిరీక్షణ
- పది నెలలుగా ఎదురు చూపు
- కుటుంబాలు గడవడం లేదని ఆవేదన
- 2009 వరదల్లో డ్యాంను రక్షించారని అప్పట్లో అవార్డులు



నిరసన తెలుపుతున్న సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బంది

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బందికి పది నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారు. తుంగభద్ర నదిపై కర్నూలు మండలం సుంకేసుల బ్యారేజీ, కర్నూలు-కడప (కేసీ) కాలువను నిర్మించారు. ఈ డ్యాం నుంచి 2,65,628 ఎకరాలకు (ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1,73,627 ఎకరాలు, కడప జిల్లాలో 92,001 ఎకరాలు) సాగునీరు, 259 గ్రామాలకు నీటి ప్రయోజనం చేకూరుతుంది. ఘనమైన చరిత్ర కలిగిన బ్యారేజీ నిర్వహణ అత్యంత కీలకం. 2005 నుంచి 2024 ఫిబ్రవరి వరకు 19 ఏళ్లుగా ముగ్గురు ఎలక్ట్రీషియన్లు, 9 మంది హెల్పర్లు బ్యారేజీ నిర్వహణ కోసం డ్యాం మెయింటెనెన్స్ కాంట్రాక్టరు శ్రీనివాసరెడ్డి వద్ద పని చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్ రద్దు చేయడంతో డ్యాం నిర్వహణ కోసం జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి సిఫారసు కాంట్రాక్ట్ సిబ్బందిని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తూ 2023 సెప్టెంబరు 14న అప్పటి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ జీవో ఆర్‌టీ నంబరు 403 జారీ చేశారు. ఎలక్ట్రీషియన్లకు రూ.18,500, హెల్పర్లకు రూ.15,500 నెల జీతం నిర్ణయించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 12న కేసీ కెనాల్ నంద్యాల డివిజన్ ఈఈ తిరుమలేశ్వరరెడ్డి, డ్యాం డీఈఈ రఘురామిరెడ్డి, ఏఈఈ ఎం.రాజుకు రిపోర్ చేసి డ్యాం నిర్వహణ విధుల్లో చేరారు. ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించడంతో కష్టాలు తీరుతాయని ఆనందించారు.

మిగతా 8లో..

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

మంత్రాలయం, అక్టోబరు 25.(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,38,02,400 వచ్చింది. 31 రోజులకు సంబంధించిన హుండీలను శుక్రవారం మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.3,38,02,400 నగదుతో పాటు 1.180 కేజీల వెండి, 136 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఈఈ సురేష్ కోణాపూర్, సూపరింటెండెంట్లు అనంత పురాణిక్, రవికులకర్ణి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, గిరిధర్, సుజ్ఞానేంద్ర, నవీన్, లక్ష్మీకాంత్, గురురాజ్ పాల్గొన్నారు.

కొర్ర సాగు భలే

పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ



మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతులు వర్షాధార భూములను సాగు చేయకుండా వదిలేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సైతం కొర్ర పంటను సాగు చేసి కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో దాదాపు 150 ఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట కోత దశకు వచ్చింది. ఎకరాకు 6 నుంచి 10 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. కొర్ర పంటను సాగు చేసుకోవడానికి రైతులు ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటం ధర రూ.3,500 ఉన్నట్లు చెబుతున్నారు. భూములను బీడుగా వదిలేయడం కంటే కొర్ర పంటను సాగు చేస్తే లాభాలు ఆర్జించవచ్చని సూచిస్తున్నారు. ఏదిఏమైనా ఈ ఏడాది కొర్ర పంట ఆశాజనకంగా ఉంది.

మార్కెట్ సౌకర్యం కల్పించాలి



మండల వ్యాప్తంగా దాదాపు 150 ఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశారు. ప్రభుత్వాలు చిరుధాన్యాలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. చిరుధాన్యాలను నూర్పిడి చేసుకోవడానికి ప్రభుత్వం తగిన యంత్రాలను మంజూరు చేయాలి. విక్రయానికి అలాగే మార్కెట్ సౌకర్యం కల్పించాలి.
- వీరేష్, మద్దికెర

కొర్ర పంట బాగుంది



రెండెకరాల్లో కొర్ర పంటను సాగు చేశాను. దిగుబడి ఆశాజనకంగా ఉంది. కొర్రసాగులో పెట్టుబడి కూడా తక్కువే. వేరుశనగ పంటతో పోలిస్తే చాలా తక్కువ. ఆని పంట మార్పిడి చేస్తే దిగుబడి చాలా వస్తుంది.
- ఎర్రిస్వామి, రైతు, ఎం అగ్రహారం

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహకం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాయి. చిరుధాన్యాలను సాగు చేయడం రైతులకు ఎంతో ఉపయోగకరం. అలాగే అంతర్ పంటలు కూడా సాగు చేయాలి. చిరు ధాన్యాల సాగుకు ప్రభుత్వం సహకారం అందిస్తుంది.
- ఉప్పర రవి, ఏవో

ఆటోలో ఊయల



ఆటోలో టమోటాలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్న కావేరి

కోసిగి అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): కోసిగి కుప్పగల్లుకు చెందిన కావేరి అనే బాలింత తన ఐదు నెలల కుమారుడు, భర్తతో కలిసి ఆటోలో టమోటాల వ్యాపారం చేస్తోంది. కుమారుడి కోసం ఆటోలో ఊయలను ఏర్పాటు చేసి ఆలనపాలనా చూసుకుంటోంది. ఓ వైపు బతుకుదెరువు.. మరో వైపు బిడ్డ బాగోగులు రెండు సమపాళ్లలో చూసుకుంటోంది.

యాగంటికి ఆర్కియాలజీ గ్రహణం

- నిధులు ఫుల్ .. అభివృద్ధి నిల్
- సొంత స్థలం లేకపోవడమే సమస్య
- అభివృద్ధి పనులకు ఆర్కియాలజీ శాఖ అడ్డంకి
- వసతులు లేక భక్తుల ఇక్కట్లు



యాగంటి ఆలయం

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): : నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నిధులు నిండుగా ఉన్నా వాటిని ఖర్చు చేయని దుస్థితిలో దేవదాయశాఖ ఉంది. ఆలయం ఆర్కియాలజీ శాఖ పరిధిలో ఉంది. పరిపాలన మాత్రం దేవదాయశాఖ పరిధిలో ఉంది. దీంతో ఏ అభివృద్ధి పని చేయాలన్నా ఆర్కియాలజీ శాఖ అధికారులు అడ్డుపడుతున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో యాగంటి క్షేత్రం

యాగంటి అత్యంత పురాతన క్షేత్రం. పల్లవులు, విజయనగరం రాజుల కాలంలో ఈ ఆలయం నిర్మితమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు యాగంటి ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటారు. ఎర్రమల కొండల మధ్య ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయం ఉండడం, యాగంటి బసవేశ్వరుడు, అంతకంతకు పెరుగుతుండడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటుంటారు. ఆలయానికి భక్తుల ద్వారా సంవత్సరానికి రూ.కోటికి పైగా ఆదాయం వస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి స్వామి వారిని హుండీని లెక్కిస్తుంటారు. ఏ అభివృద్ధి పనులు చేపట్టాలన్నా ఆర్కియాలజీ శాఖాధికారులు సహకరించడం లేదన్న విమర్శలున్నాయి. ఆలయాధికారులు, పాలకవర్గం కూడా ఏం చేయలేని దుస్థితి ఏర్పడింది. రాత్రి వేళల్లో భక్తులు బస చేయడానికి యాగంటి క్షేత్రానికి సొంత స్థలం లేదు. నిధులున్నా ఆలయానికి సొంత స్థలం లేకపోవడంతో భక్తులకు వసతి కల్పించడానికి దేవదాయశాఖ భవన నిర్మాణం చేపట్టలేకపోతోంది. దీంతో భక్తులు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ సమీపంలో టూరిజం శాఖకు చెందిన 8 గదులు గల కాటేజీ మాత్రమే ఉంది. అలాగే ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి బ్రాహ్మిణి రెసిడెన్సీ మాత్రమే అందుబాటులో ఉంది. ఇవి భక్తులకు ఏ మాత్రం సరిపోవడం లేదు. దీంతో స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులు గదులు లేకపోవడంతో వెనువెంటనే దర్శనం చేసుకొని వెళ్లిపోతున్నారు. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో ఆరుబయటే పండుకొని తెల్లారి వెళ్లిపోతున్నారు. చివరికి యాగంటి ఈవోకు, ఇతర సిబ్బందికి గది కూడా లేదు. ఆలయంలోని ఆర్కియాలజీ శాఖ పరిధిలోని ఓ సత్రంలో ఈవో, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రైవేటు వ్యక్తుల భూమి ఉంది. గతంలో పని చేసిన ఆలయ అధికారులు ప్రైవేటు వ్యక్తుల నుంచి భూమి కొనుగోలు చేసి ఉంటే ఈ కష్టాలు ఉండేవి కావని భక్తులు వాపోతున్నారు.

ఆలయం మెట్లు ఎక్కాలంటే..

వృద్ధులు, చిన్నపిల్లలు ఆలయ దర్శనం చేసుకోవాలంటే మెట్లు ఎక్కలేక ఇబ్బం దులు పడుతున్నారు. ఆలయానికి లిఫ్ట్ సౌకర్యం కావాలని ఆర్కియాలజీ అధికారులకు అనేక సార్లు యాగంటి దేవస్థానం వారు ప్రతిపాదనలు పంపినా అవి బుట్ట దాఖలయ్యాయి. ఆర్కియాలజీ శాఖకు చెందిన కొందరు ఉద్యోగులు, ఆలయ సంరక్షణకు మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ముగ్గురు పని చేస్తున్నారు. వారు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. ఆర్కియాలజీ శాఖ నుంచి దేవదాయశాఖ పరిధిలోకి యాగంటి ఆలయాన్ని తెస్తే అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

వేతన వెతలు

జీతాల కోసం సుంకేసుల బ్యారేజీ నిర్వహణ సిబ్బంది నిరీక్షణ

(7వ పేజీ తరువాయి)

సుంకేసుల బ్యారేజీ నిర్వహణ విధుల్లో చేరిన తమతో డ్యాం డీఈఈ డీఈఈ రఘురామిరెడ్డి, ఏఈఈ ఎం.రాజులు పని చేయించుకున్నారే తప్పా జీతాల బిల్లులు చేయలేదని ఉద్యోగులు వాపోతున్నారు. జీతాలు అడిగితే సీఎఫ్ఎంఎస్ ఐడీ రాలేదంటూ పది నెలలుగా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ మేరకు శనివారం కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డిని కలసి తమ గోడు విన్నవించారు. జీతంపై స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరాసతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించుకోవడానికి అప్పులు చేశామని, వాటిని తీర్చలేక అవస్థలు పడుతున్నామని డ్యాం మెయింటేన్స్ వర్కర్లు ఏకరువు పెడుతున్నారు. కనీసం స్కూల్ పిల్లల ఫీజులు కట్టలేని పరిస్థితి ఏర్పడిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇదిలా ఉండగా మొత్తం కార్మికులకు నెలకు రూ.1.95 లక్షలు ప్రకారం పది నెలలకు రూ.19.50 లక్షల వరకు వేతనం బకాయి చెల్లించాల్సి ఉంది. 2009లో అత్యధికంగా 9.25 లక్షల క్యూసెక్కులు వరద వస్తే ప్రాణాలకు తెగించి గేట్లు ఎత్తి బ్యారేజీ కొట్టుకుపోకుండా రక్షిం చారని ఇంజనీర్లు సన్మా నాలు చేశారు. ఇప్పుడేమో జీతాలు ఇవ్వకుండా కడుపు కాలుస్తున్నార నే ఏక రువు పెడుతున్నారు.



జీతాల కోసం కర్నూలు ఇరిగేషన్ ఎస్ఈని అభ్యర్థిస్తున్న బ్యారేజీ నిర్వహణ సిబ్బంది

మా గోడు వినేదెవరు?



డ్యాం నిర్వహణ విధుల్లో 19 ఏళ్లుగా పని చేస్తున్నాం. ఈ ఏడాది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో ఆర్‌టీ నం.403 జారీ చేస్తే కష్టాలు తీరుతాయని ఆనందించాం. సీఎఫ్ఎంఎస్ ఐడీ లేదంటూ జీతాల బిల్లులు పెట్టకుండా అర్థాకలితో పనలు చేయించుకున్నారు. మా గోడు పట్టించుకునేవారెవరు.
- వై.రాములు, సుంకేసుల డ్యాం ఎలక్ట్రీషియన్

అప్పుల పాలయ్యాం



సుంకేసుల డ్యాం ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాను. పది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. నాపైనే భార్య కొడుకు ఆధారపడ్డారు. కుటుంబ పోషణ కోసం అందిన చోటల్లా అప్పులు చేశాను. మీకు జీతాలు ఎప్పుడొస్తాయో.. మా అప్పు ఎప్పుడు తీరుస్తావో.. అంటూ అప్పులు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. - జి.వీరన్న, ఎలక్ట్రీషియన్

అప్పులు కూడా ఇవ్వట్లేదు



మా ఊరి పక్కనే సుంకేసుల డ్యాం ఉంది. 2009 నుంచి డ్యాం నిర్వహణ హెల్పర్‌గా పని చేస్తున్నాను. 2009లో భారీ వరదలు రావడంతో ప్రాణాలకు తెగించి గేట్లెత్తి డ్యాంను కాపాడాం. అధికారులు సన్మానాలు చేశారు. ఇప్పుడేమో జీతాలు ఇవ్వడం లేదు. అంగట్లో సరుకులు అరువు కూడా ఇవ్వడం లేదు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ఇద్దరు పిల్లలు ఇంటర్, పదో తరగతి చదువుతున్నారు.
- వెంకట్రాముడు, డ్యాం హెల్పర్, సుంకేసుల

పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేని పరిస్థితి



డ్యాం హెల్పర్‌గా 2005 నుంచి పని చేస్తున్నాం. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తిస్తే కష్టాలు తీరుతాయని ఆనందించాం. పది నెలలుగా మాతో పని చేయించుకున్న ఇంజనీర్లు జీతాలు బిల్లులు కూడా పెట్టకుండా పది నెలలు నుంచి జీతాలు ఇవ్వడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు. ఇంటర్, 9వ తరగతి చదువుతున్నారు. జీతాలు రాకపోవడంతో స్కూల్ ఫీజులు కూడా కట్టలేని పరిస్థితి ఉంది.
- వి.శేఖర్‌రెడ్డి, హెల్పర్, సుంకేసుల

కందిలో పురుగును నివారించుకోవాలి

పంటలను పరిశీలించిన ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు



కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు సుజాత, గిరీష్

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కంది, వేరుశనగ పంటలకు పచ్చ పురుగు, లద్దె పురుగు, మారాకు మచ్చల పురుగు సోకినట్లు ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు సుజాత, డీఆర్‌సీ ఏడీఏ గిరిష్, ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. శుక్రవారం గోనెగండ్లలో కంది, వేరుశనగ పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంది, వేరుశనగ పంటలను సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో కంది, వేరుశనగ పంటల్లో ఈ పురుగు చాల వరకు సోకిందని అన్నారు. కందిలో ఈగ నివారణకు థయాక్లోప్రిడ్ 0.7 గ్రామలు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పచ్చ పురుగును అరికట్టడానికి స్పీనోసాడ్ 0.3 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే వేరుశనగ లద్దె పురుగుకు ఏమామెక్టిన్ బెంజోఏట్ 0.3 గ్రాముల బెల్లం రెండు శాతం కలుపుకొని పిచికారి చేయాలన్నారు. అలాగే నియోజకవర్గంలో పెసర, మినుము, చిక్కుడు, వేరుశనగ జిలుగు వంటి పంటలకు కూడా పురుగు ఆశించిందన్నారు. కాసిన కాయల్లోకి పురుగు వెళ్లి గింజలను పూర్తిగా తినివేస్తాయని తెలిపారు. నివారణకు వేపనూనె 3 మిల్లీ లీటర్లకు ఒక లీటర్ నీటిని కలుపు కొని పిచికారి చేసుకోవాలన్నారు. తరువాత పురుగు గమనిస్తే ఏమమెక్టిన్ బెంజోఏట్ 0.3గ్రాములు లేదా నోవాలురాన్ ఒక మిల్లీ లీటరును ఒక లీటరు నీటిలో కలుపుకొని రెండు శాతం బెల్లం ద్రావణంలో కలిపి పిచికారి చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు మహేంద్ర, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

జాగరణ..!



(7వ పేజీ తరువాయి)

కర్నూలు మార్కెట్ యార్డు చరిత్రలో ప్రస్తుత పరిస్థితులు గతంలో ఎప్పుడూ ఎదుర్కోలేదు. వారం రోజులుగా సర్వర్ మొరాయించడంతో పంట ఉత్పత్తుల విక్రయాలు ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మార్కెట్ యార్డులో పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు నిలిపివేయాల్సి వచ్చింది. ఫలితంగా ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో రైతన్నలు నాలుగు రోజులుగా జాగరణ చేస్తున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ యార్డుల్లో రోజుకు వేల టన్నుల పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, ఆముదం తదితర 16 రకాల పంట ఉత్పత్తుల విక్రయాలు జరుగుతున్నాయి. ఆయా మార్కెట్ యార్డులకు 2.10 లక్షల బస్తాల ఉత్పత్తులు వచ్చాయి. విక్రయాలు జరగకపోవడంతో రైతులు నాలుగు రోజులుగా యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఈ పరిస్థితి మరి దారుణంగా ఉంది. ఉల్లిగడ్డల వాహనాలు బారులుదీరడంతో రెండు రోజులుగా ఆఫ్‌లైన్‌లో వేలాలను నిర్వహించారు. ఉల్లిగడ్డ ఉత్పత్తులు భారీగా రావడంతో అధికారులు ఈ విధానంలో కూడా విక్రయాలు సాగించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ యార్డులో దాదాపు 1.50 లక్షల బస్తాల ఉల్లిగడ్డలు పేరుకుపోయాయి.



సర్వర్ సమస్య తీరేదెన్నడో..?


సర్వర్ పని చేయక.. వివిధ పంట ఉత్పత్తులు అమ్ముకునే అవకాశం లేక పండగ పూట రైతన్నలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించింది. రైతులకు అప్పులు ఇచ్చిన వారు తాము చెప్పిన ధరకు ఉంట విక్రయించాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. ఒకేసారి సమస్యలు చుట్టుముట్టడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో మూడు రోజులుగా తమ పంటల ఉత్పత్తుల విక్రయాల కోసం ఎదురుచూస్తున్నారు.

విధిలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నాం

కర్నూలు మార్కెట్ యార్డులో వేల టన్నుల ఉల్లి విక్రయాలు నిలిచిపోయాయి. సర్వర్ సమస్య కారణంగా రెండు రోజులపాటు ఆఫ్ లైన్‌లో విక్రయాలు జరిపి రైతుల ఇబ్బందులను కొంత వరకు తీర్చగలిగాం. సర్వర్ సమస్య తొందరలోనే తొలగిపోయే అవకాశం ఉంది. ఉల్లితో పాటు మిగతా పంట ఉత్పత్తులను వెంట వెంటనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం. రైతులు అర్థం చేసుకుని సహకరించాలి.
- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ప్రకృతి ఒడిలో ప్రయాణం

పచ్చని చెట్ల మధ్య నంద్యాల - గిద్దలూరు రహదారి




నంద్యాల - ప్రకాశం జిల్లాల మధ్య సరిహద్దులో ఆకుపచ్చని అందాల మధ్య రైలు పట్టాలు






బ్రిటీషు వారు నిర్మించిన రైల్వే వంతెన దిమ్మెలు




నల్లమల అడవి

రుద్రవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాల మధ్య ప్రయాణం.. పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ సాగే పయనం.. నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే ప్రతి ఒక్కరికీ కలిగే అనుభూతి ఇది. పచ్చని అందాలకు నల్లమల అడవి కేరాఫ్ అన్న విషయం అందరికీ తెలిసిందే. ఎత్తయిన కొండలు లోతైన లోయలు, పచ్చని వృక్షాలు, ఒంపు సొంపుల రహదారులు, పక్షుల కిలకిలరావాలు, రకరకాల వన్యప్రాణుల మధ్య సాగే ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. పచ్చని తోరణాలతో 20 కి.మీ. మేర అడవిలో ప్రయాణం సాగుతుంది. అలాగే వందల ఏళ్ల క్రితం బ్రిటీషు వారు నిర్మించిన రైల్వే వంతెనను కూల్చి వేసినా అందుకోసం నిర్మించిన దిమ్మెలు నేటికీ పదిలంగా ఉన్నాయి. ఎత్తయిన కొండల మధ్య పచ్చని వృక్షాల నడుమ రైల్వే పట్టాలు ఉన్నాయి. అటు రైల్వే ప్రయాణికులు, ఇటు రోడ్డు ప్రయాణికులను పచ్చదనం అందాలు కట్టిపడేస్తున్నాయి.



నల్లమలలో రోడ్డు మార్గం



నల్లమలలో రైల్వే లైన్

కబ్జాలు.. అవినీతిపై రచ్చ

- రసాభాసగా నగర పాలక సమావేశం
- బాహాబాహీకి దిగిన కార్పొరేటర్లు
- అవినీతిపై విచారణకు మంత్రి టీజీ భరత్ ఆదేశం





నగర పాలక సమావేశంలో తోసుకుంటున్న కార్పొరేటర్లు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో జరిగిన అవినీతి అక్రమాలపై వైసీపీ, టీడీపీ కార్పొరేటర్లు బాహాబాహీకి దిగారు. 'నీవెంత అంటే..నీవెంత అని' చిత్తం వచ్చినట్లు అరుచుకున్నారు. ఒక దశలో ఇరువర్గాలు కొట్టుకుంటారనే భయంతో కొందరు బయటికి వెళ్లారు. దీంతో మేయర్ సమావేశాన్ని పది నిమిషాలు వాయిదా వేశారు. ఆ సమయంలో అత్యవసర పని ఉండటంతో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ బయటికి వెళ్లిపోయారు. మూడేళ్ల కాలంలో నగరంలో అనేక భూకబ్జాలు జరిగాయని, వాటిపై తక్షణమే విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు. శుక్రవారం సుంకేసుల రోడ్డులోని నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న రెండో కౌన్సిల్ సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, వాణిజ్య శాఖల మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. మొట్టమొదటిసారిగా కౌన్సిల్ సమావేశానికి హాజరైన మంత్రి టీజీ భరత్‌ను నగర మేయర్, కమిషనర్ రవీంద్రబాబు సన్మానించారు. సమావేశంలో ఏడు అజెండాలకు ఆమోదం తెలిపారు. నగర పాలక సాధారణ నిధుల నుంచి రూ.1.90 కోట్లు అభివృద్ధి పనులు ఖర్చు చేయడానికి పాలకవర్గం పచ్చజెండా ఊపింది. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎస్‌ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, అధికారులు, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీ క్యాంపులో బంకుల ఏర్పాటుపై రగడ..

నగరంలోని సి. క్యాంపు ప్రభుత్వ పాఠశాలకు ఆనుకుని బంకులు వేయడంపై వైసీపీ, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. శ్రీరాంనగర్ కార్పొరేటర్ కటారి పల్లవి బంకులను తొలగించాలని సభ దృష్టికి తీసుకువచ్చింది. దానిని టీడీపీ నాయకులే వేసారని...పాఠశాలలో బాలికల మరుగుదొడ్లను ఆనుకుని బంకులు వేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. దీంతో వైసీపీ కార్పొరేటర్లు కొందరు మేము కూడా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి బంకులు ఏర్పాటు చేసుకుంటామని ఖరాఖండిగా చెప్పేసారు. దీంతో టీడీపీ కార్పొరేటర్ పరమేష్ కలగజేసుకుని మామిదాలపాడు నుంచి జమ్మిచెట్టు వరకు రింగ్ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందన్నారు. కేవలం మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ తుంగభద్రను కబ్జా చేయడంతో రోడ్డు నిర్మాణం ఆగిపోయిందన్నారు. ఇంతలో వైసీపీ నుంచి నాగలక్ష్మీరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, క్రిష్ణకాంత్‌రెడ్డితో పాటు పలువురు కబ్జా చేసి ఉంటే నిరూపించాలని సవాల్ విసిరారు. ఇంతలో టీడీపీ కార్పొరేటర్లు క్రాంతికుమార్, పరమేష్ ఆగ్రహంతో ఊగిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కబ్జాలు జరిగాయని, వాటిని పోలిస్తే ఇదేమీ పెద్దది కాదని అన్నారు. అవసరమైతే సి.క్యాంపులోని బంకులపై కూడా విచారణకు సహకరిస్తామన్నారు. అయితే వైసీపీ కార్పొరేటర్లు కావాలనే సమావేశం జరగకుండా మధ్యలో రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ క్రమంలో క్రాంతికుమార్, యూనుస్‌ల మధ్య తోపులాట జరిగింది. ఇంతలో మరికొందరు కార్పొరేటర్లు కలగజేసుకుని వారిద్దరిని పక్కకి తప్పించారు. బిర్లా గేట్ వద్ద ఉన్న చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వద్ద మామూళ్లు వసూలు చేసిన సంగతి తమకందరికి తెలుసునని క్రాంతికుమార్ అన్నారు.

తాగునీటి సరఫరాపై ఆవేదన

నగర పాలక పరిధిలోని శివారు కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని 41వ వార్డు విష్ణుటౌన్ షిప్, లక్ష్మీపురం, క్రిష్ణానగర్, శరీన్‌నగర్, పెద్దపాడు, ఎస్టేట్, తదితర శివారు కాలనీలలో ప్రతి రోజు నీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు.



మాట్లాడుతున్న మేయర్



అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

నగర పాలక సంస్థలోని వాటర్ వర్క్స్, సుంకేసుల నుంచి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు వరకు చేపడుతున్న పైప్‌లైన్లలో జరిగిన అవినీతిపై విజిలెన్సు విచారణకు ఆదేశిస్తున్నాం. ప్రతి కౌన్సిల్ సమావేశంలో మినిట్స్ బుక్ మెయిన్‌టెయిన్ చేయండి. కమ్యూనిటీ హాల్స్‌ను పునరుద్ధరించాలి. నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నాము. **- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి**



విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలి. కల్లూరు పరిధిలోని 16 పార్కులను కబ్జా చేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడంతోపాటు కొందరిని బెదిరించారు. **- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే**



తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది

కోడుమూరు నియోజకవర్గం 38,39,40 వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మరో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించాలి. **- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే**

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం : రాజశేఖర్, ఎస్‌ఈ

నగర పాలక పరిధిలోని అన్ని వార్డులకు ప్రతి రోజూ నీరు సరఫరా చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకంగా సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుతో పాటు కాలనీలలో ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకులను నిర్మిస్తాం.

స్మార్ట్ సిటీగా మార్చాలని సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి



నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే కేంద్రం నుంచి ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. **- ఎస్. రవీంద్రబాబు, కమిషనర్**

అటవీ భూమిపై వివాదం

- ఆక్రమణలను అడ్డుకున్న అటవీ అధికారులు



అటవీ అధికారులతో మిలిటరీ కాలనీ వాసుల వాగ్వాదం

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని గార్గేయపురం నగర వనానికి ఆనుకొని ఉన్న అటవీ శాఖ భూమిపై వివాదం నెలకొంది. రిజర్వు ఫారెస్టుగా ఉన్న భూమిలో ఓ వ్యక్తి ఏకంగా రహదారి నిర్మాణానికి పూనుకోవడంతో శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత తలెత్తింది. నగర వనానికి ఆనుకొని ఉన్న స్థలాన్ని 1891లో అటవీ శాఖకు కేటాయించినట్లు గెజిట్ నోటిఫికేషన్ చూపుతోంది. అయితే 1955లో విశ్రాంత సైనిక ఉద్యోగులకు ఒక్కొక్కరికి ఏడు ఎకరాల చొప్పున కేటాయించి రెవెన్యూ అధికారులు పట్టాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే మిలటరీ కాలనీకి చెందిన కొందరు అటవీ భూముల్లో రహదారి నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులు గురువారం అక్కడికి చేరుకొని తమ పరిధిగా చెప్పుకునే ప్రాంతం వరకు సరిహద్దు స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే మిలిటరీ కాలనీకి చెందిన కొందరు పెద్దఎత్తున శుక్రవారం అక్కడకు చేరుకుని ఆ రాళ్లను తొలగించారు. విషయం అటవీ శాఖ అధికారులకు తెలియడంతో అప్రమత్తమై రెవెన్యూ, జలవనరులు, పోలీసు శాఖలకు సమాచారం ఇచ్చారు. పోలీసు భద్రత నడుమ రెవెన్యూ శాఖకు సంబంధించిన డిప్యూటీ సర్వేయర్, జలవనరుల శాఖ నుంచి సహాయ ఇంజనీరు అక్కడికి చేరుకున్నారు. ఎవరైనా తమ పరిధిలోకి వస్తే చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హెచ్చరించారు. ఇప్పటికే తమ పరిధిలోకి చొరబడిన వారిపై పోలీసు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



స్థానికులు తొలగించిన సరిహద్దు రాళ్లు

స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను అందుబాటులోకి తెస్తాం

- మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సేవలను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం ఉదయం క్యాన్సర్ హాస్పిటల్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలిసి పరిశీలించారు. పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.సీఎస్‌కే ప్రకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనం తరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పెరిగిన రోగుల సంఖ్యను బట్టి పోస్టులను భర్తీ చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.చిట్టినరసమ్మ, కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఉన్నారు.



ఆసుపత్రిలో పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి భరత్

పొదల్లో మృతదేహం

నందికొట్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని పొదల్లో కుక్కలు పీక్కుతింటుండగా దారిన వెళుతున్న రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటన శుక్రవారం నందికొట్కూరు సంతమార్కెట్ పక్కనే ఉన్న పొలాల దారిలో జరిగింది. పోలీసులు పరిశీలించగా అక్కడ స్విచ్‌ఆఫ్ చేసిన సెల్‌ఫోన్, పురుగుల మందు డబ్బా లభ్యమయ్యాయి. దీంతో సెల్‌ఫోన్‌ను ఆన్ చేసి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడు కర్నూలు మండలం ఉల్లాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు (45)గా గుర్తించారు. శ్రీనివాసులు ప్రతి సోమవారం సంతకు వచ్చి పొటేళ్ల మారుబేరం చేస్తూ జీవించేవాడు. గత సోమవారం ఉదయం నందికొట్కూరు సంతకు వచ్చాడని, ఆ రోజు సాయంత్రం వరకు ఫోన్ పని చేసిందని ఆ తర్వాత స్విచ్ ఆఫ్ అయ్యిందని అన్నారు. వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లి వ్యక్తి ఇంటికి వస్తాడని అనుకొన్నామని శ్రీనివాసులు కుమారులు విలపించారు. శ్రీనివాసులుకు అప్పులు ఉన్నాయని ఆ బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. మృతుడికి భార్య శ్రీదేవి, కుమారులు పరశురాముడు, మల్లికార్జున ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




శ్రీనివాసులు(ఫైల్)

మట్టిమిద్దె కూలి మహిళ మృతి

బనగానపల్లె, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని సంకలాపురం గ్రామానికి చెందిన రాజంరెడ్డి రామసుబ్బారెడ్డి భార్య (40) ఉమామహేశ్వరమ్మ మట్టిమిద్దె కూలి మృతి చెందింది. ఆ ఘటన శుక్రవారం జరిగింది. మధ్యాహ్నం ఇంట్లో ఉండగా ఇటీవల కురిసిన వర్షానికి మట్టిమిద్దె ఒక్కసారిగా కూలిపోయింది. పైకప్పు పడడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. భర్త రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎద్దుల బండి బోల్తా.. రైతు మృతి

ఆస్పరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడగొండ గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం ఉరుకుందప్ప పొలం పనులకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా ఎద్దుల బండి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఉరుకుం దప్ప(45) మృతి చెందాడు. మృతుడికి భార్య వరలక్ష్మితోపాటు ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ ఇంటిల్లిపాది శోకసంద్రంలో మునిగిపోయింది. సర్పంచ్ ఆంజనేయులు యాదవ్ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



ఉరుకుందప్ప (ఫైల్)

భర్తను హతమార్చిన భార్య

ఆత్మకూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): భర్తను భార్య హతమార్చిన ఘటన ఆత్మకూరు మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కృష్ణాపురం గ్రామానికి చెందిన చిట్యాల ఆదిరామిరెడ్డి (35) అనే వ్యక్తితో 16 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాలోని యర్రగొండపాలెం మండలం గల గంజివారిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి వివాహం జరిగింది. వీరికి చరణ్‌కుమార్‌రెడ్డి (12), హైమావతి (11) సంతానం. చిట్యాల ఆదిరామిరెడ్డి మరో మహిళతో వివాహేతర సంబం ధాన్ని కొనసాగించడంపై కొన్నేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం కూడా భార్యాభర్తలు గొడవ పడుతుండగా బంధువులు వచ్చి సర్ది చెప్పారు. మధ్యాహ్నం నుంచి ఇంటికి తాళంవేసి ఉండటంతో అనుమానం వచ్చి ఇరుగు పొరుగు వారు సాయంత్రం ఇంట్లోకి తొంగి చూశారు. దీంతో ఆదిరామిరెడ్డి మంచంలో శవమై కనిపించాడు. మృతుడి బంధువులు పోలీసులకు సమాచారం అందివ్వడంతో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు ఓబులేసు, సురేష్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మీదేవి తన భర్తను బలమైన ఆయుధంతో హతమార్చి పిల్లలతో సహా ఇంటి నుంచి పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు మృతుడి మామ భాస్కరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.



ఆదిరామిరెడ్డి (ఫైల్)

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కాల్వ గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీల ఆహ్వానం మేరకు కాల్వ గ్రామానికి చేరుకుని ముస్లింలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న మసీదు నిర్మాణం నిలిచిపోయిందని, నిధులు కేటాయించాలని ముస్లింలు రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే రాష్ట్ర ముస్లిం మైనార్టీ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో ఫోన్‌లో ముస్లింలతో మాట్లాడించారు. మసీదు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చామని మల్లెల తెలిపారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ప్రారంభం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలో 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 బాలబాలికల అథ్లెటిక్ పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. కర్నూలులో 50 సంవత్సరాల నుంచి క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామని, భవిష్యత్తులోనూ సహాయ సహకారాలు ఉంటాయని టీజీ వెంకటేశ్ హామీ ఇచ్చారు. ఆర్‌ఐపీఈ భానుమూర్తి మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం సహాయం ఉంటుందన్నారు. 2 శాతం స్పోర్ట్స్ కోటాను ఉద్యోగంలో వినియోగించుకోవాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. డీవీఈవో పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ కర్నూలులో క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడలు నిర్వహించడం హర్షణీయమన్నారు. అతిథులు 13 జిల్లాల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 900 మంది బాలబాలికలు హాజరయ్యారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, హర్షవర్ధన్, ప్రిన్సిపాల్ సుంకన్న, క్రీడాదాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి, వివిధ జిల్లాల కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులు కాపాడతాం

- చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీం

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతామని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీం అన్నారు. శుక్రవారం నగరంలోని వక్ఫ్‌బోర్డు కాంప్లెక్స్‌లో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల ద్వారా మైనార్టీల ప్రయోజనాల కోసం ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేద ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని తెలిపారు. జిల్లాలో ముస్లింలకు టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. కమిటీ సభ్యులు గౌస్ రబ్బాని, షేక్ రమీజ్ బాషా, షేక్ మహబూబ్,షేక్ అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ ఇబ్రహీం

బాలుడి అదృశ్యం

- హంద్రీలో గల్లంతయ్యాడని అనుమానం

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పొలం గట్టున ఉన్న దివ్యాంగుడైన బాలుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని అలారు దిన్నెలో చోటుచేసుకొంది. గ్రామానికి చెందిన నర్సన్న, సోమేశ్వరి దంపతులకు ఏడేళ్ల కూతురు శ్రావణ, ఐదేళ్ల కుమారుడు మహేష్ ఉన్నారు. మహేష్ పుట్టుకతో దివ్యాంగుడు. రోజుమాదిరిగానే బాలుడిని తల్లిదండ్రులు పొలానికి తీసుకెళ్లారు. పొలం గట్టున బాలుడు సెల్‌ఫోన్ చూస్తూ ఉండగా.. తల్లిదం డ్రులు పత్తి తీసే పనుల్లో నిమగ్నమయ్యారు. పదినిమిషాల తరువాత బాలుడు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా మహేష్ ఆచూకీ కనపడలేదు. పొలం పక్కనే ఉన్న హంద్రీలో పడిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. దేవనకొండ పోలీసులు, గ్రామస్తులు హంద్రీ పరిసర ప్రాంతంలో చీకటి పడేంతవరకు వెతికినా బాలుడి అచూకీ లభ్యం కాలేదు.



మహేష్ (ఫైల్)

కల్లూరు మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా జుబేదాబీ

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల శాంతి మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా తడకనపల్లె పొదుపు సంఘం అధ్యక్షురాలు ఎస్.జుబేదాబీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం శరీన్‌నగర్‌లోని డీఆర్డీఏ కార్యాలయంలో వెలుగు ఏపీఎం పుష్పావతి అధ్యక్షతన కల్లూరు మండల శాంతి మహిళా సమాఖ్య వార్షిక సహాసభ నిర్వహించారు. ముందుగా గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిని వివరించి, డీఆర్డీఏ వెలుగు ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను పొదుపు సంఘాల మహిళలకు వివరించారు. అనంతరం కల్లూరు మండలంలోని అన్ని గ్రామ సంఘాల లీడర్లతో చర్చించి, తీర్మానం చేసి శాంతి మండల మహిళా సమాఖ్యకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా ఎస్.జుబేదాబీ, ఉపాధ్యక్షురాలు పి. అరుణమ్మ, సెక్రటరీగా ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శులుగా ఎం.రా ణీ, ట్రెజరర్‌గా పి.రాణిలను ఎన్నుకున్నట్లు ఏపీఎం పుష్పావతి తెలిపారు.

సహన కుటుంబానికి న్యాయం చేయాలి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన మదిర సహన కుటుంబానికి న్యాయం చేయాలని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్అబ్దుల్ సుభాన్ ఇమాండ్ చేశారు. శుక్రవారం కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ నవీన్ చేతిలో తెనాలికి చెందిన యువి సహన హత్యకు గురికావడం బాధాకరమన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు పి. ఇక్బాల్ హుసేన్, ఎస్.ఎండి. షరీఫ్ ఉన్నారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రమీజాబీ, దస్తగిరి, రాధలు ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపు మాంటిసోర్సిలో చెకుముఖి సంబరాలు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో 27న మాంటిస్సోరి పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజాహుస్సేన్ శుక్రవారం తెలిపారు. సంబరాలకు పాఠశాలలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ సభలతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. శుక్రవారం గూడూరు మండలంలోని ఆర్ కానాపురం గ్రామంలో రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కార కార్యక్రమం గ్రామసభలను నిర్వహించారు. భూమల రీ సర్వేలో జాయింట్ ఎల్‌పీ, ఖాతాలు తప్పుగా పడటం, సర్వే నెంబర్లు అసమతుల్యత, ఇమ్యూటేషన్ ఇతర సమస్యలపై రైతుల నుండి 11 ఆర్జీలను అధికారులు స్వీకరించారు. ఆర్జీలను పరిశీలించి భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ మునిస్వామి, రీ సర్వే డీటీ లోకేశ్వర రెడ్డి, సర్వేయర్ బాలు నాయక్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ప్రకృతి వ్యవసాయ బీఎల్‌ఎంపీ లక్ష్మయ్య కోరారు. శుక్రవారం ఓర్వకల్లులోని పొదుపులక్ష్మి మండల ఐక్య సంఘం కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో వెలుగు సీసీలు, వీవోఏలు హాజరయ్యారు. ప్రకృతి వ్యవసాయ శిక్షణలో మహిళా సంఘాల పాత్ర, మండల సమైఖ్య ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేసే సంస్థగా ఎలా పని చేస్తుందని ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య గౌరవాధ్యక్షురాలు విజయభారతి, వంశీకృష్ణ, ఏపీఎం వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

900 గ్రాముల శిశువుకు మెరుగైన వైద్యం



కోలుకున్న శిశువుతో అశ్విని హాస్పిటల్, చిన్న పిల్లల వైద్యులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏడో నెలలో 900 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు కర్నూలు అశ్విని హాస్పిటల్ బర్త్ అండ్ బీయాండ్ వైద్యులు మెరుగైన చికిత్స అందించి ప్రాణాన్ని కాపాడారు. శుక్రవారం నగరంలోని జోహరాపురం రోడ్డులో ఉన్న హాస్పిటల్‌లో చిన్న పిల్లల వైద్యనిపుణులు డా.నాగేశ్వరరెడ్డి, డా.వీరరత్నాకర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. నగరంలోని ఎన్ ఆర్‌పేటకు చెందిన రంజిత మొదటి కాన్పు కోసం అశ్విని హాస్పిటల్‌లో చేరింది. సెప్టెంబరు 20వ తేదీన వైద్యులు అత్యవసరంగా ఆమెకు కాన్పు చేశారు. ఆడ శిశువు జన్మించగా 930 గ్రాముల బరువుగా నిర్ధారించారు. ఐదు రోజులకు మరింత బరువును 820 గ్రాములకు తగ్గారు. ఆయాసం, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సమస్యలతో బాధపడుతున్న శిశువుకు నెల రోజులు చికిత్స, మందులు అందించి శుక్రవారం పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ అయ్యారు. మెరుగైన సేవలు అందించడం వల్ల శిశువు కోలుకుందని వైద్యులు తెలిపారు. శిశువుకు చికిత్స అందించిన వారిలో నియోనెటాలజిస్టులు డా.రఘువీర్, డా.ఎన్.కిశోర్ కుమార్ సహకరించినట్లు వైద్యులు తెలిపారు.

ఉల్లి రైతుల కష్టాలు తీర్చండి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో గత కొన్ని రోజులుగా ఉల్లి రైతులు పడుతున్న కష్టాలను శుక్రవారం రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగన్నాథం, ఇతర ప్రతినిధులు పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఈనామ్ సర్వర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దాదాపు వారం రోజులుగా సర్వర్ పని చేయక అధికారులు ఏమీ చేయ లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితిని మార్చాలని ప్రభుత్వాన్ని కోరారు.



కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల

ఆటల్లేవు!

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మైదానాలు లేవు. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడల్లో రాణించాలని ఆసక్తి ఉన్నా నిరాశే ఎదురవుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఓర్వకల్లు మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో మైదానాలు కరువయ్యాయి. ఓర్వకల్లులోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6 నుంచి 10 వ తరగతి వరకు, మోడల్ స్కూల్‌లో ఇంటర్ వరకు దాదాపు 800 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. దీంతో విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటున్నారు. వాలీబాల్, కబడ్డీ, హాకీ, క్రికెట్, షాట్‌పుట్, పుట్‌బాల్, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్ తదితర పోటీల్లో విద్యార్థులకు ప్రతిభ ఉంది. క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రి ప్రభుత్వం మంజూరు చేసింది. అన్ని ఉన్నా తమకు ఆడుకోవడానికి మైదానం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు పేర్కొంటున్నారు. గతంలో జిల్లా అధికారులకు ఈ విషయాన్ని కూడా ఫిర్యాదు చేసినా లాభం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడామైదానాలు ఏర్పాటు చేసి, క్రీడల్లో రాణించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

- క్రీడలకు దూరమవుతున్న విద్యార్థులు
- క్రీడా కిట్లు లేవు.. ఆట స్థలాలు లేవు
- పట్టించుకోని అధికారులు, ప్రభుత్వాలు



మోడల్ స్కూల్



ఈ ఆటలు కనిపించడం లేదు.. (ఫైల్)

మైదానాలు లేవు



క్రీడల్లో ఆడుకోవాలని ఉన్నా.. పాఠశాలలకు క్రీడా మైదానాలు లేవు. దీంతో క్రీడలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తే క్రీడల్లో రాణిస్తాను.

- ఉదయ్‌కిరణ్, విద్యార్థి

సౌకర్యాలు కల్పించండి



కస్తూర్బాగాంధీ స్కూళ్లలో మైదానాలు ఏర్పాటు చేయాలి. అలాగే జాతీయ రహదారి నుంచి మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాల వరకు రోడ్డు వేయాలి. విద్యార్థులు ఆటస్థలాలు లేకున్నా క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. అధికారులు స్పందించి ఆట మైదానాలు ఏర్పాటు చేయాలి.

- రమేష్, సీపీఐ నాయకుడు

క్రీడలను ప్రోత్సహించాలి



చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తే క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తారు.

- రామకృష్ణ, సీపీఎం నాయకుడు

అనంతపురం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి

● మంత్రి టీజీ భరత్‌ను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి, కొంకతి లక్ష్మీనారాయణ



కర్నూలులో మంత్రి టీజీ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

కల్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పరిశ్రమలశాఖ మంత్రి టీజీ.భరత్‌కు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. టీజీ. భరత్‌ను అనంతపురం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించిన నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి కర్నూలులో ఆయనను కలిశారు. అనంతపురం నియోజకవర్గ పరిశీలకుడు కొంకతి లక్ష్మీనారాయణతో కలిసి మంత్రి కార్యాలయంలో మంత్రి టీజీ. భరత్‌ను మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. అర్బన్ నియోజకవర్గంతో పాటు పలు అంశాల గురించి చర్చించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి తీసుకువచ్చిన అంశాలన్నింటిపై మంత్రి టీజీ.భరత్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే అనంతపురం వస్తానని అన్ని అంశాలు చర్చించుకుందామని మంత్రి తెలిపారు.

మూగజీవాలను కాపాడుకుందాం

●పశుగణన సర్వే పోస్టర్ విడుదల



పశుగణన సర్వే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): 21వ పశుగణనను పురస్కరించుకుని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత తన స్వగృహంలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి సర్వే కరపత్రాన్ని విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ఉన్నత లక్ష్యంతో ప్రతి 5 సంవత్సరలకు ఒకసారి నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధికారులకు సహకరించాలని కోరారు. డిప్యూటీ డైరెక్టర్ రమారావు, ఏడీ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన రీసర్వేలో తలెత్తిన భూసమస్యలను పరిష్కరమే లక్ష్యంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ కలెక్టర్ వెంకట నారాయణమ్మ రైతులకు సూచించారు. శుక్రవారం సల్కాపురం గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో డిప్యూటీ కలెక్టర్ రైతులకు అవగాహన కల్పించారు. స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ గత రీసర్వేలో జరిగిన తప్పులను పరిష్కరించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ప్రజలు, రైతుల భూసమస్యల పరిష్కరించేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని తెలిపారు. అనంతరం రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో కల్లూరు తహసీల్దారు కె.ఆంజనేయులు, ఎంపీపీ బి.శారద, టీడీపీ నాయకుడు దేవేంద్రారెడ్డి, సర్పంచు బి.మద్దిలేటి, రాజశేఖర్, ఆలంభాషా, మండల సర్వేయర్ శ్రీనివాసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ భూముల వేలం



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర వీరభద్ర, భీమేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూవేలంపాట దేవదాయశాఖ తిరుపతి సంయుక్త కమిషనర్ ఆజాద్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కల్లూరులోని స్వామివారి ఆలయంలో సర్వే నెంబరు 145, 293 ప్లాట్ నెం: 9, 10లోని రెండెకరాల ఖాళీ స్థలానికి నిర్వహించిన బహిరంగ వేలంలో 15 మంది అభ్యర్థులు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. ఈ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగవేలంలో గంగవరం కార్తీకరెడ్డి ఒక సంవత్సరానికి రూ.9.30 లక్షలకు దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి గుర్రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్, మద్దిలేటి నరసింహస్వామి ఆలయ ఈవో శ్రీరామాంజనేయులు, సహాయ కమీషనర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తాం

● మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీజీవీ గ్రూప్ సంస్థ తరుపున క్రీడాకారులకు ఎల్లవేలలా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం డీఎస్‌ఏ అవుట్‌డోర్ స్టేడియంలోని బాస్కెట్‌బాల్ ఎరోనాలో భూషణ్‌రావు స్మారక ప్రథమ బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభమ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. 30 ఏళ్ల నుంచి టీజీవీ కుటుంబం అనేక సహాయ సహకారలు చేస్తుందని అన్నారు. బాస్కెట్‌బాల్ దిగ్గజం భూషణ్‌రావు సేవలు వెలకట్టలేనివన్నారు. బాస్కెట్‌బాల్ వేదిక దాత న్యాయవాది శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ బాస్కెట్‌బాల్ క్రీడకు గత 10 సంవత్సరాల నుంచి క్రీడకు, క్రీడాకారులకు ఆర్థికసాయం అందజేశానని తెలిపారు.డీఎస్‌డీవో భూపతిరావు మాట్లాడుతూ బాస్కెట్‌బాల్‌కు భూషణ్‌రావు సేవలు అమోఘమన్నారు. అంతకుముందు అతిథులు భూషణ్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఎన్‌సీసీ కల్నల్ రమేష్, ఇండస్ ఇన్‌చార్జి విల్సన్, డా.డబ్ల్యూ.సీతారామ్, న్యూరోసర్జన్ సీవి నాగరాజరావు, భానుమూర్తి, దాదాబాషా, శ్రీనివాసులు, గీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందరికీ అందాలి

కర్నూలు అర్బన్: ఉచిత ఇసుక అందరికీ అందాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం టీజీ భరత్ కార్యాల యం వద్ద సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి మంత్రి టీజీ భరత్ క్షీరాభిషేకం చేశారు. ఇసుక ఉచితంగా అందరికీ అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రాంతాల నుంచి ఇసుకను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్లవచ్చన్నారు. గ్రూపులుగా ఏర్పడి ఇసుకతో వ్యాపారం చేయాలని చూస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చ రించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

కర్నూలు రూరల్: ఆర్టీసీలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ సంబంధితాధికారులకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. కొత్తబస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం తీసుకోవలసిన మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకుశంగా చర్చించారు. సమావేశంలో కర్నూలు రీజనల్ మేనేజర్ శ్రీనివాసులు, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ హరినాథ్‌బాబు, కర్నూలు-1, 2 డిపో మేనేజర్లు మరియు అసిస్టెంట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

మూగ జీవాలకు లోటు రానివ్వొద్దు

కర్నూలు అగ్రికల్చర్: నోరు లేని జీవాల అవసరాలు మనమే దగ్గరుండి చూసి, వాటికి ఏ లోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం దేశవ్యాప్తంగా 21వ పశుగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా పశుసంవర్ధకశాఖ జేడీతో పాటు డిప్యూటీ డైరెక్టర్ దుర్గా ప్రసన్నబాబు తదితరులతో కలిసి పశుగణన వాల్‌పోస్టర్లను మంత్రి టీజీ భరత్ తన స్వగృహం ప్రాంగణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పశుగణన ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా సర్వేను చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే.. మూగ జీవాలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించవచ్చని అన్నారు. కలెక్టర్ పి. రంజిత్ బాషా పశుగణన కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులకు ఆదేశించారు.

డీఈవోకు ఎస్టీయూ నాయకుల అభినందనలు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్ పాల్‌ను ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్నలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ఉన్నటువంటి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు నాయకులు హుశేన్‌మియా, ఎల్లనాగరాజు, జానకిరాముడు, సుధీర్, నారాయణ, శాంతమూర్తి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

● 27న ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం:

స్థానిక సలాంభవన్ ఎస్టీయూ భవన్‌లో ఈ నెల 27న ఎస్టీయూ జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్. గోకారి, టి.జనార్దన్ తెలిపారు. ఈ సమావేశానికి ఎస్టీయూ రాష్ట అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయవాణి కన్వీనర్ జి. నాగేశ్వరరావు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న హాజరువుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవులు, జడ్పీఎఫ్ బకాయిలు, మధ్యంతర భృతి, బదిలీలు, పదోన్నతులు వంటి విద్యారంగ సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు. కాబట్టి జిల్లాలోని ఎస్టీయు కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు , మండలాల, పుర, నగర పాలక అధ్యక్ష ప్రధాన ఆర్థిక కార్యదర్శులు హాజరై సమావేశం జయప్రదం చేయాలని కోరారు.

15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేపట్టాలి

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు 15 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సరవణ చేపట్టాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్.విజయభాస్కర్ డిమాండ్ చేశారు. బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్, క్యాజువల్ కాంటాక్టు వర్కర్స్ ఫెడరేషన్ సమన్వయం కమిటీ న్యూ ఢిల్లీ పిలుపు మేరకు శుక్రవారం ప్రకాష్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 4జీ/5జీ సర్వీసులను తక్షణమే ప్రవేశపెట్టాలన్నారు. సంస్థలోపని చేస్తున్న క్యాజువల్,కాంట్రాక్టు సిబ్బందికి ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రామలింగం, పి.మద్దిలేటి, ఎం.యాకోబు, మహేశ్వరరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మరో చోటుకు తరలించాలి

గూడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కె నాగలాపురం గ్రామంలో పర్ల రహదారిలో ఉన్న మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి మరొక చోటుకు తరలించాలని కె నాగలాపురం సర్పంచ్ జె నయోమి, టీడీపీ సీనియర్ నాయకుడు జె సురేష్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గ్రామంలో పర్ల రహదారిలో ఉన్న మద్యం దుకాణం వల్ల విద్యార్థులు, మహిళలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పం దించి మద్యం దుకాణాన్ని మరొక చోటుకు తరలించాలని డిమాండ్ చేశారు.

'బాల కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణకు చట్టాలు ఉన్నాయని, బాలలను పనిలో పెట్టుకుంటే బాల కార్మిక నిషేధ చట్టం ప్రచారం శిక్షలు ఉంటాయని జిల్లా బాలల పరిరక్షణ అధికారి టి. శారద అన్నారు. శుక్రవారం నగరంలోని 48వ వార్డు రోజావీధిలో కార్మికులకు బాల కార్మిక చట్టాలపై ఆమె అవగాహన కల్పించారు. రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో అవహగాన కల్పించారు. శారద మాట్లాడుతూ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టి బాల కార్మికుల నిర్మూలనకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్మికులు కూడా పెద్దలు పనికి, పిల్లలు బడికి అనే ప్రభుత్వ నినాదాన్ని అనుసరిస్తూ కచ్చితంగా పిల్లలకు చదువు చెప్పించాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్లు ఎన్ నరసింహులు, జి. గీతావాణి, స్థానికులు ఆంజనేయులు, రాముడు, నాగన్న, శేషమ్మ, నారాయణమ్మ తదితరలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఆర్వో

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నూతన డీఆర్వోగా నియమితులైన వెంకటనారాయణమ్మ కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అదజేశారు. ఆమె నవంబరు 2వ తేదీలోపు బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రంగస్థల కళాకారుడు దివంగత పి. అక్బర్ బాషా సంస్మరణలో భాగంగా శనివారం సాయంత్రం 6.30 గంటలకు నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. మనోహర్‌బాబు తెలిపారు. నగరంలో మద్దూర్‌నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోట సమావేశ హాలులో ఈ నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

సి. బెళగల్, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి: మండంలోని పోలకల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గుండ్రేవుల మునిచంద్ర (35) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఉదయం ఛాతిలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పడంతో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అమర్, రాజు, ఏసన్న, మద్దిలేటి లింగన్న,ఎల్లప్ప మృత దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ప్రభుత్వ భూమిలో ప్లాట్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు రూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పెద్దపాడులో ప్రభుత్వానికి సంబంధించిన వంకను పూడ్చి అందులో ప్లాట్లు వేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కల్లూరు మండల కార్యదర్శి మధు ఆధ్వర్యంలో కర్నూలు ఆర్డీవో కార్యలయం ఎదుట ధర్నా చేశారు. రామకృష్ణ మాట్లాడుతు పెద్దపాడులో వద్దేని వంకను ఆక్రమించుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యలయ ఏవో వేణుగోపాలరావుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపి, శీను, యేసు, రాజు, చిన్న రాముడు, పెద్దరాముడు, బజారి, రాజు భీమన్న తదితరులు పాల్గొన్నారు.

'కప్పట్రాళ్లలో యురేనియం తవ్వకాలు నిలిపివేయాలి'

కర్నూలు కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కప్పట్రాళ్ల గ్రామ పరిధిలో యురేనియం తవ్వకాలు నిలిపివేయాలని డీవీఎంసీ సభ్యుడు కాకర్ల శాంతికుమార్ కోరారు. శుక్రవారం నగరంలోని అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్ఓ శ్యామలకు వారు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దేవనకొండ మండలం, కప్పట్రాళ్ల గ్రామంలో యురేనియం తవ్వకాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం యురేనియం తవ్వకాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని అన్నారు. దీని వల్ల గ్రామాల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి యురేనియం తవ్వకాలపై చేస్తున్న పరిశోధనలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేపల్లి రంగుడు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పని చేయని ఈనామ్ సర్వర్

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఈనామ్ సర్వర్ నాలుగు రోజులుగా పనిచేయడం లేదు. దీంతో శుక్రవారం కూడా వ్యవసాయ పంట ఉత్పత్తులకు పాత పద్ధతుల్లోనే టెండర్లు కొనసాగాయి. ఖరీఫ్ ఉత్పత్తులు భారీగా వస్తున్న సమయంలో సాంకేతిక సమస్య తలెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాత పద్ధతిలోనే టెండర్లకు ధరల వివరాలు, తూకాలు ఆలస్యమవుతోంది. దీంతో తాము ఇంటికెళ్లేలోపు అర్థరాత్రి అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని మార్కెట్‌యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు.


టెండర్ వేస్తున్న వ్యాపారి

ఆటోను ఢీకొన్న లారీ.. ఇద్దరికి గాయాలు



గాయపడ్డ చిన్నలక్ష్మన్న, కొండపల్లి రంగమ్మ

పత్తికొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గుత్తి రహదారిలో ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాల మేరకు. శుక్రవారం ఉదయం పత్తికొండ నుంచి ఆటో ఐదుగురితో తుగ్గలికి బయలుదేరింది. ముంబై నుంచి చెన్నైకు వెల్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీ కొట్టడంతో ఆటో బోల్తాపడింది. రాతనకు చెందిన వృద్ధుడు చిన్నలక్ష్మన్న తలకు తీవ్రగాయాలయ్యాయి. పత్తికొండకు చెందిన కొండపల్లి రంగమ్మ కాలు విరిగింది. మరోముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. లక్ష్మన్నను కర్నూలుకు, రంగమ్మను గుంతకల్లుకు చికిత్స కోసం తరలించారు. ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

నరకదారి


గుంతలు పడిన తారు రోడ్డు

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పి.కోటకొండ బస్టాండ్ నుంచి బేతపల్లి గ్రామానికి వెళ్లే రహదారి నరకప్రాయంగా మారింది. ఈ రహదారిపై పది గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. రోజుకు రెండు బస్సులు కూడా వెళ్తుంటాయి. తారురోడ్డు శిథిలమవ్వడంతో అడుగడునా గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనాల ప్రయాణం నరకప్రాయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది తారు రోడ్డేనా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా ఇదే పరిస్థితి. పలుసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి, నూతన రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోండి

ఆలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వాన్ని తీసుకోవాలని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ శుక్రవారం కోరారు. కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జీలు, సభ్యత్వ నమోదులో పాల్గొని గ్రామ స్థాయిలో ప్రతి కార్యకర్త సభ్యత్వం పొందేలా చూడాలన్నారు. సభ్యత్వం ఉంటే పార్టీ ప్రయోజనాలు అందుతాయని, రూ.100 చెల్లించి సభ్యత్వం పొందిన వారికి రూ.5లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. ఆదివారం ఆలూరులో సభ్యత్వం నమోదును ప్రారంభి స్తున్నాని తెలిపారు.


మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

పాడి రైతు కోసం చంద్రన్న పథకాలు

హాలహర్వి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు పథకాలు ప్రవేశ పెట్టారని పశువైద్యాధికారి అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాల యంలో అధికారులతో మాట్లాడారు. అఖిల భారత పశుగణన సర్వే చేపడుతున్నామని, పశువులకు రోగాలు రాకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వేలో వచ్చిన లోపాలను సరి చేసుకోవాలి


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేలో తలెత్తిన లోపాలను రైతులు సరిచేసు కోవాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండలంలోని బైచిగేరిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 146మంది రైతులు రీ సర్వేలో తమ భూములను కోల్పోయామని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన సబ్ కలెక్టర్ భూ రీసర్వేలో తలెత్తిన లోపాల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, రీసర్వే డీటీ పెద్దయ్య పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

బైచిగేరి సచివాలయాన్ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తహసీల్దార్ శివరాముడుతో కలిసి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సకాలంలో విధు లకు హాజరు కావాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చూడాలని ఆదేశించారు.

పనికి రాకపోతే పేమెంట్ ఎలా చేశావ్?

- ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీసిన పీడీ

ఆదోని రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనికి రానివారికి పేమెంట్ ఎలా చేశావని అరేకల్లు ఫీల్డ్ అసిస్టెంట్ గోపాల్‌ను పీడీ నాసరరెడ్డి ప్రశ్నించారు. 2023 - 24 ఆర్థిక సంవత్సరం ఉపాధి పనుల సామాజిక తనిఖీ స్థానిక ఏపీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతి బాగోతం బట్టబయలైంది. ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటంపై పీడీ కోపోద్రిక్తులయ్యారు. ఒకటి, రెండు తప్పులను వదిలేయవచ్చని, మీ అవినీతికి అంతు లేకుండాపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.25కోట్ల వరకు ఉపాధి పనుల కోసం నిధులు ఖర్చు పెట్టామని ఏపీవో ఖాలీక్ తెలిపారు.


ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ నాసర రెడ్డి

రైతులకు సూచనలు ఇవ్వండి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక

పత్తికొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు సూచనలు ఇవ్వాలని ఉద్యానవన ప్రదాన శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక సూచించారు. జిల్లా వనరులు సహాయ సంచాలకులు వేదమణి ఆధ్వర్యంలో పత్తికొండలో శుక్రవారం రైతు సేవాకేంద్రాల సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. పత్తికొండ ప్రాంతంలో ప్రదానంగా సాగుచేసే ఉల్లి, మిరప, టమోటా, వేరుశనగ పంటల సాగులో దశలవారీగా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించడం, పురుగు మందుల పిచికారుతఈ వాడకంపై సిబ్బందికి వివరించారు. 2024-25 సంవత్సరానికి ప్రభు త్వం 2019 నాటి పంటల బీమా విధానాన్నే అమల్లోకి తెచ్చిందని ఫసల్‌బీమా, వాతావరణ బీమాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకు రుణం తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా, ఇతర రైతులు మీసేవ, సచివాలయాలు, సీఎస్‌సీ సెంటర్‌ల ద్వారా ప్రీమియం చెల్లించాలన్నారు. ఏడీఏ విజయమోహన్ కుమార్, టెక్నికల్ ఏవో మునెమ్మ, ఏవో, ఏఈవోలు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీపై మంత్రికి ఫిర్యాదు


మంత్రికి ఫిర్యాదు చేస్తున్న నీలకంఠ

ఆదోని టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు దోపిడీకి పాల్పడుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ మంత్రికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రోగులకు సౌకర్యాలు కల్పించకుండా సంపాదనకే ప్రాధాన్యమిస్తున్నారని, సామాన్యులు చితికిపోతున్నారన్నారు. ఈ విషయంలో ప్రత్యేక కమిటీ వేయాలని కోరామని తెలిపారు.



విరాళంగా మొక్కలు

మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల పూర్వ విద్యార్థులు, హెచ్‌ఎం దేవేంద్రప్ప, విద్యాకమిటి చైర్మన్ చంద్రహరికి మొక్కలు విరాళంగా అందజేశారు. 2002-2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పూజారి రఘు, మిత్రులతో కలిసి 22 మొక్కలను అందజేశారు. గ్రామానికి చెందిన గుడికాటి రామాంజులు కూడా మొక్కలను అందజేశారు. పాఠశాలలో నాటిన చెట్లను విద్యార్థినులు దత్తత తీసుకుని పెంచాలన్నారు. చెట్లు పెరగడం వల్ల మనకు నీడని వ్వడంతో పాటు మంచి వాతావరణాన్ని కూడా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


మొక్కలను ఇస్తున్న పూర్వ విద్యార్థులు

మొక్కలు నాటండి


తుగ్గలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచాలని తుగ్గలి ఏపీజీబీ మేనేజర్ శ్రీలత అన్నారు. శుక్రవారం జడ్పీ హై స్కూల్‌లో మొక్కలు నాటారు. మొక్కలతో పర్యావరణం కాలుష్యం తగ్గుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరి ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ చిన్నతనం నుంచే మొక్కలు పెంచడం ప్రారంభించారన్నారు. బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి

మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మండల బీసీ సెల్ నాయకులు బురుజుల చెన్నకేశవులు, కొత్తూరు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం బురుజుల గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో బురుజుల గ్రామంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమ గ్రామానికి, సీసీ రోడ్లకు రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గ్రామంలో సురక్షిత నీటి కోసం కృషి చేస్తాననీ హామీ ఇచ్చారనీ అన్నారు. బురుజుల గ్రామంలో టీడీపీ అదిష్టానం ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదుకు శ్రీకారం చుడుతామని అన్నారు. పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



మద్యం దుకాణాన్ని తరలించాలి

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తరలించాలని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇచ్చారు. ప్రధాన రహదారి కావడం, దుకాణానికి సమీపంలోనే ప్రైవేట్ పాఠశాల ఉందని, విద్యార్థులకు పాదచారులు, వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐవైఎఫ్ మండల అధ్యక్షుడు రవి ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్, మధు, సురేంద్ర, భరత్, రవితేజ, తదితరులు ఉన్నారు.


ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



నాబార్డు నిధులతో అభివృద్ధి


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధులతో గ్రామాల అభివృద్ధి చెందుతాయని డిప్యూటీ జనరల్ మేనేజర్ అబూవ రాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మాదాపురం గ్రామంలో వాటర్‌షెడ్ పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో వెయ్యి హెక్టార్లలో వివిధ వాటర్‌షెడ్ పనులు చేస్తున్నామని తెలిపారు. దీంతో భూగర్భ జలాల వృద్ధి చెందుతాయన్నారు. నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, కెడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజరు రామాంజినేయులు, అప్కాబ్ మేనేజర్ సహిదాసుల్తాన్, నవయుత అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సీఈవో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

ఆదోని అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యల పరిష్కారానికి నెల 28న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ మాట్లాడుతూ రాయలసీమ మిల్లు 2002లో మూతపడినా ఇంకా బకాయలు ఇవ్వలేదన్నారు. నరేష్, కుమార్ పాల్గొన్నారు.



జలకళ



ఆర్డీఎస్ ఆనకట్టపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

కోసిగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలం పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టపై వరదనీరు పోటెత్తింది. తుంగభద్ర డ్యాం నుంచి 1.28 లక్షల క్యూసెక్కుల నీరు 25 గేట్ల ద్వారా భారీ ఎత్తున వరద నీరు దిగువకు పారుతోంది. దీంతో మండల పరిధిలోని అగసనూరు సమీపంలోని తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీఎస్ ఆనకట్టకు జలకళ సంతరించుకుంది.

మంత్రాలయం: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వద్ద తుంగభద్ర నది ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం సాయంత్రం మంత్రాలయం వద్ద 309.79 మీటర్ల నీటి మట్టంతో 82 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నది. నదీతీర గ్రామాల ప్రజలను తహసీల్దారు రవి, సీడబ్ల్యూసీ, మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, శ్రీమఠం అధికారులు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు.



మంత్రాలయం వద్ద తగ్గిన తుంగభద్ర వరద ప్రవాహం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• డీఎంహెచ్‌వో భాస్కర్



గోనెగండ్లలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో భాస్కర్ సూచించారు. మండలంలో డెంగీ కేసులు ఎక్కువ కావడంతో ఆదోని డివిజన్ మలేరియా నివారణ అధికారి సాయిబాబాతో కలిసి డీఎంహెచ్‌వో శుక్రవారం గోనెగండ్లలో ని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎన్ని ఓపీలు వస్తున్నాయని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దోమలు పెరగడం ద్వారామలేరియా, డెంగీ, చికున్‌గూన్యా వ్యాధులు ప్రబలుతాయన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అనుపత్రికి తీసుక రావాలని వైద్యసిబ్బంది గ్రామస్థులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుధాకర్, కార్తీక్, ఎంపీహెచ్‌వో పరమేశ్వరప్ప, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బెంగుళూరులో వలస కూలీ మృతి



ఈడిగ రామాంజనేయులు (ఫైల్)

కోసిగి అక్టోబరు 25, (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన ఈడిగ రామాంజనేయులు (28) బెంగళూరులో శుక్రవారం మృతి చెందాడు. భార్య మహేశ్వరి, ఇద్దరు కుమారులు, కూతురుతో కలిసి బెంగళూరుకు వలస వెళ్లాడు. అక్కడ తాపీ మేస్త్రీ పని చేసేవాడు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్ సమీపంలో పనులు చేసుకుండగా గోడ కూలీ మీద పడటంతో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో భార్య, ముగ్గురు పిల్లలు రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వైభవంగా స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం, అక్టోబరు 25.(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం కార్తీక నవమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణ బోధ పూజ మందిరంలో మూలరాములు, జయరాములు, దిగ్విజరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, మంగళ వాయిద్యాల మధ్య బంగారు రథం పై వజ్రాలు పొదిగిన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను అధిష్టించి పీఠాధిపతి మంగళహారతులతో ఆలయ ప్రాంగాణం చుట్టూ వైభవంగా ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శేష వస్త్రం, ఫల,పుష్ప,మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.



బంగారు రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

అలరించిన కోలాట నృత్య ప్రదర్శనలు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో కార్తీకమాసం పురస్కరించుకుని 220 మంది భజన మండళ్లతో కోలాట నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం ప్రవచన మండపంలో దానవాని సాహిత్య శిక్షణ ఆర్గనైజర్ కౌతాళం అప్పనాచార్యులు భజన మండళ్ల మహిళలకు హిందూ సాంప్రదాయాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం భజనలు, కోలాట నృత్యాలు భక్తులను అలరించాయి. అదే విధంగా ఊంజల మండపంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం రాత్రి శ్రీకృష్ణుని చిత్రం వేసి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ప్రకాషాచార్, ద్వారపాలక అనంత స్వామి, వ్యాసరాజాచార్, పవనాచార్ తదితరులు పాల్గొన్నారు.



ఊంజల మండపం వద్ద ముగ్గుతో శ్రీకృష్ణుని చిత్రాన్ని రూపొందిస్తున్న దృశ్యం

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఎమ్మిగనూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి శనివారం గోనెగండ్ల మండలంలో పర్యటించనున్నారు. ముందుగా ఆయన ఎమ్మిగనూరులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ఆయన గోనెగండ్ల మండలం చిన్నమర్రివీడు గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకోనున్నారు.

పశుగణన అవసరం

గోనెగండ్ల, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో పశుగణన ఎంతో అవసరమని ఎంపీడీవో మణిమంజరి, మేజర్ గ్రామ సర్పంచ్ హైమావతి, పశువైద్యులు వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనగండ్లలోని ఎంపీడీవో కార్యాలయం దగ్గర 21వ అఖిలభారత పశుగణంక పోస్టర్స్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అనంతశయనా, సీనియర్ అసిస్టెంట్ బాబుభాస్కర్, టీడీపీ నాయకులు పాల్గన్నారు.

నేటి నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న ముత్తురెడ్డి

కోసిగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నుంచి చేపడుతున్నట్లు టీడీపీ కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగిలో వారు మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారాలోకేశ్ ఆదేశాల మేరకు మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో కోసిగి మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, వక్రాణి వెంకటేశ్, చింతలగేని నర్సారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.10వేలు ఇవ్వాలన్నారు. సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలన్నారు. ఆటో కార్మికుల పిల్లలకు ఉచితంగా చదువు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో తిమ్మగురుడు, విజయేంద్ర, రవి, నరసింహాలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

పెద్దకడుబూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుకుంట గ్రామ సమీపంలో ఎల్లెల్సీ లో గుర్తు తెలియని శవం లభ్యమైంది. మహిళ వయస్సు 60 ఏళ్లు ఉంటుందని పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మహిళ వివరాలు తెలిసిన వారు ఉంటే పెద్దకడుబూరు పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

దీపావళి రోజున ఉచిత సిలిండర్లు

పెద్దకడుబూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏపీ మహిళలకు ఉచితంగా మూడు సిలిండర్లను అందజేస్తుందని జిల్లా తెలుగు మహిళాసాధికార ప్రతినిధి నరవశశిరేఖ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు దీపావళి రోజు ఉచితంగా మూడు సిలిండర్లను అందజేయనున్నట్లు తెలిపారు.

డ్రైనేజీలను నాణ్యతతో నిర్మించాలి: కమిషనర్

ఎమ్మిగనూరు టౌన్,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీలను నాణ్యతతో నిర్మించాలని కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లోని డ్రైనేజీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి మాట్లాడుతూ డ్రైనేజీకి ఇరువైపులా ఉన్న గోడలను నాణ్యతతో నిర్మించాలని, పనుల్లో రాజీపడకూడదని అన్నారు. సర్కిల్‌లోని తోపుడు బండ్ల వ్యాపారస్తులలో మాట్లాడుతూ చెత్తను చెత్త బుట్టలోనే వేసి మునిసిపల్ వాహనానికి లేదా సిబ్బందికి అందజేయాలన్నారు. ఎవరైతే చెత్తను ఆరుబయట వేస్తారో వారికి రూ1000 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఉత్తమ సేవలకు ప్రశంస

ఎమ్మిగనూరు, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించిన మురళికి ఎస్పీ బిందుమాదవ్ ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు. శుక్రవారం కర్నూలులో జరిగిన పోలీసు అధికారుల సమావేశంలో ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

మాధవరం ఎస్ఐకి ఉత్తమ ప్రశంసా పత్రం

మంత్రాలయం: మంత్రాలయం మండలంలోని మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్‌కు ఉత్తమ ప్రశంసా అవార్డు దక్కింది. వివిధ కేసులను సమర్థవంతంగా ఛేదించినందుకు శుక్రవారం కర్నూలులో ఎస్పీ బిందు మాధవ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎమ్మిగనూరు ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మురళి, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్

పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలి



ఏఈకి వినతి పత్రం అందచేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలని సీఐటీయూ అధ్యక్షుడు, కార్యదర్శి గోవిందు, రాముడు అన్నారు. శుక్రవారం మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ మునిసిపల్ కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని మాస్టర్ కేంద్రాల వద్ద చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా సేవలు అందించారన్నారు. అలాంటి కార్మికులకు ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం శోచనీయమన్నారు. కార్మికులకు సరైన వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేశన్న, నాగ రాజు, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలోనే సమస్యలు పరిష్కారం



నందవరంలో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

నందవరం, అక్టోబరు 25(ఆంధ్జ్యోతి): గ్రామ సభలోనే రైతులు ప్రజల సమస్యలు పరిష్కారమౌతాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని జోహరాపురం గ్రామంలో ఆర్ఐ జర్మీయా ఆధ్వర్యంలో గ్రామ సభ జరిగింది. తహసీల్దారు ప్రజల దగ్గర నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించారు. అందరి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. డీటీ మహేష్, సర్వేయర్లు అక్బర్‌బాష, ముగతి శేఖర్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

గోనెగండ్ల: రీ సర్వేలలో జరిగి పొరపాట్లను సరిచేసేందుకే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శుక్రవారం లింగందిన్నె గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీషా, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



ఎర్రబాడులో కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న కాటికాపరులు

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కాటికాపరులను ప్రభుత్వం నాలుగోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కాటికాపరుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కాటికాపరుల సంఘం ఆధ్వర్యంలో ఎర్రబాడు సచివాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సంఘం నాయకులు సుంకన్న, జయరాజు, శాంతిరాజు, కరుణాకర్, దినకర్, డప్పుకళాకారుల సంఘం నాయకులు రత్నమయ్యల పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. జీవో నెంబర్ 1234 ప్రకారం దళిత పేటకు రెండు ఎకరాలు శ్మశానానికి కేటాయించి అందులో బోరు, కాంపౌండ్ వాల్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత ఆరోగ్య బీమా, ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాటికాపరుల సంఘం నాయకులు పాల్గొన్నారు.